మనం
హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్
బుధవారం | 5 | ఆగస్టు | 2026 పేజీలు:6

## రేపు ఉపాధి కార్యాలయంలో
# జాబ్ మేళా

### జిల్లా ఉపాధి కల్పనాధికారి ఏ. వందన

హైదరాబాద్,ఆగస్టు 04(మనం న్యూస్): జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం రేపు మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేలా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి ఎ. వందన తెలిపారు. అపోలో ఫార్మసీలో రిటైల్ ట్రైనీ అసోసియేట్, ట్రైనీ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ కేటగిరీల్లో దాదాపు 100 ఖాళీల భర్తీకి ఈ మేలా నిర్వహిస్తున్నటు పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండి, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీ-ఫార్మసీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులని ఆమే తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో రేపు ఉదయం 11 గంటలకు నేరుగా హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9346204294 ఫోన్ నంబర్లో సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

## యూడీఐడీ ప్రక్రియను
# వేగవంతం చేయాలి

### హైదరాబాద్ పాలనాధికారిణీ డాక్టర్ ప్రియాంక అలా



హైదరాబాద్,ఆగస్టు 04(మనం న్యూస్): దివ్యాంగులకు అందించే యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ కార్డల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డితో కలసి ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లతో యూడీఐడీ సేవల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పత్రుల వారీగా పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. వైకల్య నిర్ధారణ వేగంగా జరిగేందుకు క్యాంపుల సంఖ్యను పెంచాలని, అవసరమైతే ఇతర ఆస్పత్రుల నుంచి స్పెషలిస్ట్ వైద్యులను డిప్యుటేన్‌పై నియమించాలని తెలిపారు. దివ్యాంగుల దరఖాస్తులను సరిగ్గా రిఫర్ చేసేలా డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇవ్వాలని ఆమే అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కొత్త పింఛన్ పథకం ప్రారంభించనున్న నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, అందుకు వైద్యులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. పోర్టల్ వివరాల ప్రకారం జిల్లాలో ఇప్పటివరకు వచ్చిన 9,136 దరఖాస్తుల్లో 6,959 కార్డులు జారీ చేశామని, మిగిలిన 1,999 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ డాక్టర్ నారాయణ, ఉస్మానియా, నిలోఫర్, సరోజినిదేవి తదితర ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



## విద్యా, గృహ రుణాలకు
# అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

### అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్టు 04(మనం న్యూస్): జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకులు రుణాలు అందించాలని అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి త్రైమాసిక డీసీసీ/డిఎల్ఆర్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో విద్యా, గృహ రుణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. 2026-27 వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం వివిధ రంగాలకు రూ. 4,81,936.64 కోట్లు రుణాలు అందించాల్సి ఉండగా, మొదటి త్రైమాసికంలో రూ. 2,04,832.59 కోట్లు (42.50%) మంజూరు చేయడంపై బ్యాంకర్లను అభినందించారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ. 49,856.23 కోట్లు, ప్రాధాన్యత రంగాలకు రూ. 55,557.58 కోట్లు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. లక్ష్యాలను సాధించని బ్యాంకులు తదుపరి త్రైమాసికంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ ఎల్డీఓ హేమలత పరంజేపే, నాబార్డ్ డీడీఎం హర్ష రఘురాం, ఎల్‌డీఎమ్ నరసింహమూర్తి, వివిధ బ్యాంకుల కంట్రోలర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రూ.3.70 లక్షల
# సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీల పంపిణీ

### బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే శ్రీగణేష్ అండ..



2

## దక్షిణ మధ్య రైల్వేలో
# భారీ టికెట్ తనిఖీ

### రూ.30.53 లక్షల జరిమానా వసూలు

### 169 రైళ్లలో ప్రత్యేక డ్రైవ్.. 4,121 మంది టికెట్ లేని ప్రయాణికుల గుర్తింపు..



2



## రూ.3.70 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీల పంపిణీ

**బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే శ్రీగణేష్ అండ..**

సికింద్రాబాద్, ఆగస్టు 4 (మనం న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఇద్దరు వైద్య చికిత్స పొందుతున్న బాధితులకు మొత్తం రూ.3.70 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ లెటర్స్ ఆఫ్ క్రెడిట్ లను అందజేశారు. తిరుమలగిరి మండలం పెద్దతోకట్టకు చెందిన కైతోజ్ భీంరాజ్ కుమారుడు అనీల్ కుమార్ చికిత్స కోసం రూ.2.50 లక్షలు, వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామానికి చెందిన మహమ్మద్ జసీర్ కుమార్తె మహమ్మద్ హిఫ్జ చికిత్స కోసం రూ.1.20 లక్షల ఎల్ఓసీలను మంజూరు చేయించారు. మంగళవారం తన నివాస కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ స్వయంగా బాధితుల కుటుంబ సభ్యులకు ఎల్ఓసీలను అందజేశారు. ఈ సందర్భంగా తమ పిల్లల వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రత్యేక చొరవ తీసుకుని సాయం అందించిన ఎమ్మెల్యే శ్రీగణేష్కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆగస్టు 05న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొత్త మేడిపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనుల నేపథ్యంలో రెండు విడతల్లో షట్డౌన్**


ఘట్కేసర్ మనం న్యూస్ ఆగస్టు 04: కొత్తగా నిర్మిస్తున్న 33/11 కేవీ మేడిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల్లో భాగంగా 11 కేవీ లైన్లను రీ-అలైన్ చేసి 33 కేవీ సైడ్ ఆరమ్స్ ఏర్పాటు చేయాల్సి ఉన్నందున బుధవారం (ఆగస్టు 05) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏఈ నారపల్లి తెలిపారు. మొదటి విడతలో పీ టీ 33/11 కేవీ సబ్‌స్టేషన్కు చెందిన 11 కేవీ ప్రగతి నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ఈ షట్డౌన్ ప్రభావం కమలనగర్, సాయి నగర్ ఈస్ట్, ధరణి కాలనీ, బాపూజీ నగర్, అరుణోదయ కాలనీ, ఎస్వీ కాలనీ, పీ టీ కాలనీ, వెస్ట్ కమలానగర్, విశ్వమ్ విహార్, సుమా రెసిడెన్సీ, గురు ఎన్క్లేవ్, భగత్సింగ్ నగర్, అయోధ్య కాలనీ, ఎస్వీ కాలనీ తదితర ప్రాంతాలపై ఉంటుంది. రెండో విడతలో 11 కేవీ ధరణి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ సమయంలో సాయి హిల్స్, పీ టీ కాలనీ, శ్రీనివాస నగర్, వినాయక నగర్, సంపూర్ణ కాలనీ మెయిన్ రోడ్, సాయిరామ్ నగర్ కాలనీ, క్రాంతి కాలనీ, గ్రీన్ ల్యాండ్స్ కాలనీ, పంచవటి కాలనీ రోడ్లు 1, 2, 3, విహారిక కాలనీ రోడ్లు 1, 2, 3, 4, 5, కాకతీయ నగర్ కాలనీ, ధరణి కాలనీ ప్రాంతాలు విద్యుత్ అంతరాయానికి గురికానున్నాయి. విద్యుత్ పనులు పూర్తయ్యే వరకు వినియోగదారులు సహకరించాలని, సాధ్యమైన చోట్ల బ్యాక్‌ఫీడింగ్ ద్వారా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజలు తమ అవసరాలను ముందుగానే ప్రణాళిక చేసుకుని విద్యుత్ అంతరాయం సమయంలో సహకరించాలని ఏఈ నారపల్లి విజ్ఞప్తి చేశారు.



# దక్షిణ మధ్య రైల్వేలో భారీ టికెట్ తనిఖీ..

**రూ.30.53 లక్షల జరిమానా వసూలు**
**169 రైళ్లలో ప్రత్యేక డ్రైవ్..**
**4,121 మంది టికెట్ లేని ప్రయాణికుల గుర్తింపు..**

సికింద్రాబాద్, ఆగస్టు 4 (మనం న్యూస్) దక్షిణ మధ్య రైల్వే పరిధిలో టికెట్ లేని ప్రయాణాలను అరికట్టేందుకు వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 3న జోన్ వ్యాప్తంగా భారీ టికెట్ తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల పరిధిలో 186 మంది టికెట్ తనిఖీ సిబ్బంది 169 రైళ్లలో రోజంతా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో టికెట్ లేకుండా లేదా అనధికారంగా ప్రయాణిస్తున్నవారు, బుక్ చేయని లగేజీతో ప్రయాణిస్తున్న 4,121 మందిని గుర్తించి మొత్తం రూ.30.53 లక్షల జరిమానా వసూలు చేశారు. అదనంగా రైల్వే ప్రాంగణంలో చెత్త వేసిన 35 మందికి రూ.7,300, అనుమతి లేకుండా వ్యాపారం నిర్వహించిన 19 మందికి రూ.38,000, ధూమపానం చేసిన ఇద్దరు ప్రయాణికులకు రూ.4,000 జరిమానా విధించారు. డ్రైవ్ సందర్భంగా టికెట్ తనిఖీ సిబ్బంది ప్రయాణికులకు టికెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ఎదురయ్యే జరిమానాలు, రైల్వే ప్రాంగణంలో పరిశుభ్రత, ధూమపానం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. చెల్లుబాటు అయ్యే టికెట్లతోనే ప్రయాణించి, టికెట్ తనిఖీ సిబ్బందికి సహకరించాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వాణిజ్య విభాగాన్ని అభినందించారు. టికెట్ తనిఖీలు టికెట్ లేని ప్రయాణాలను నియంత్రించడంతో పాటు నిజమైన ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.






# భార్య కౌన్సిలర్... భర్త పెత్తనం...

**9 వార్డ్ కార్యాలయంలో కౌన్సిలర్ స్థానంలో భర్త హవ**
**ఎల్లంపేట మున్సిపల్ 9 వ వార్డులో అధికారిక కార్యాలయంలో భర్త హవ**
**ఎల్లంపేట మున్సిపాలిటీలో ఏం జరుగుతుంది**

మేడ్చల్, ఆగస్టు 4 : ( మనం జిల్లా ప్రతినిధి ): స్థానిక సంస్థలు మహిళలకు రిజర్వేషన్ కల్పించినప్పటికీ సమాజంలో తీవ్ర చర్చ చర్చనీయాంశం అవుతుంది. రాజకీయాలపై మహిళలకు సరైన అవగాహన లేకపోవడం, తెర వెనుక ఉండి భర్తలే నిర్ణయాలు తీసుకోవడం, అధికార దుర్వినియోగానికి పాల్పడడం వంటివి మేడ్చల్ జిల్లా ఎల్లంపేటలో జోరుగా సాగుతుంది. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో కౌన్సిలర్ గా గెలుపొందిన మహిళలు వంటింటికే పరిమితమవుతున్నారు. వారి స్థానంలో భర్తల హవా కొనసాగుతుంది . ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయం పరిధిలోని 9వ వార్డులో అవార్డు కౌన్సిలర్ రజిత బదులుగా ఆమె భర్త హవా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఎల్లంపేట మున్సిపల్ కు ఫిర్యాదు సైతం చేశారు. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో 9వ వార్డే కాకుండా మిగతా వార్డులలో మహిళలు గెలిచిన కౌన్సిలర్ స్థానాలలో వారి భర్తలే హవా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది మహిళలను చైతన్యవంతులను చేసి వారికి పరిపాలన స్వేచ్ఛను కల్పించాలని ఉద్దేశంగా సమాజంలో వారికి ఒక గుర్తింపు ఇవ్వాలని సంకల్పంతో రిజర్వేషన్లు కల్పిస్తే వాటిని మహిళల భర్తలు పురుష అహంకారంతో మహిళలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళలకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ మేడ్చల్ మల్కాజ్గిరి లో అమలు కావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆడవారంటే వంటింటికే పరిమితం అనే చులకన భావన ఇంకా మేడ్చల్ జిల్లాల్లో ఉండడం బాధాకరం.




**భార్య కౌన్సిలర్... భర్త పెత్తనం**

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు కు బి ఆర్ఎస్ పార్టీ తరఫున మహిళ రజిత కౌన్సిలర్ గా ఎంపికయ్యారు. కానీ అక్కడ పెత్తనం అంత ఆమె భర్త రాజేందర్ దేనని తెలుస్తుంది.కౌన్సిలర్గా ఎంపికైన రజితకు అక్కడ అధికారికంగా వార్డ్ కార్యాలయాన్ని అప్పగించారు. అయితే ఆ కార్యాలయంలో కౌన్సిలర్ రజిత కూర్చోవాల్సిన అధికారిక చేరులో ఆమె భర్త రాజేందర్ కూర్చొని సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ గెలిచింది మహిళా రజిత నా.. లేక ఆమె భర్త రాజేందరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విధంగా రాజపుల్లారం తాండ లో కాంగ్రెస్ తరపున గెలుపొందిన కౌన్సిలర్ శాంతి అయితే ఆమె భర్త రాజు మాత్రం కౌన్సిలర్ అని చెప్పుకుంటూ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫోన్ చేస్తే అయిన ట్రూ కాలర్ లో రాజు కౌన్సిలర్ అంటూ వస్తుంది అని స్థానికులు పేర్కొంటున్నారు. అసలు ఇక్కడ కౌన్సిలర్లు ఎవరు అంటూ అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి

భార్యలు కౌన్సిలర్ల లేక భర్తలు కౌన్సిలర్ల అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను భర్తలు కాలరాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.




**9వ వార్డు పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు**

9వ వార్డుపై స్థానికులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. 9వ వార్డులో ఎం రజితను కౌన్సిలర్గా గెలిపిస్తే ఆమె భర్త పెత్తనం చేస్తున్నారు అంటూ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో సమగ్ర విచారణ తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## సిద్ధిపేటలో పారిశ్రామికవేత్తల
# అవగాహన కార్యక్రమం

**ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుకు టీఐసీసీఐ ప్రతినిధుల ఆహ్వానం**



హైదరాబాద్ ఆగస్టు 4 : ఆగస్టు 12, న సిద్ధిపేటలో నిర్వహించనున్న పారిశ్రామికవేత్తల అవగాహన మరియు ప్రత్యేక విక్రేతల అభివృద్ధి కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా గౌరవ ఎమ్మెల్యే శ్రీ తన్నీరు హరీష్ రావు గారిని ట్రైబల్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టీఐసీసీఐ) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమాన్ని జాతీయ ఎస్సీ-ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో, ట్రైబల్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టీఐసీసీఐ) సహకారంతో నిర్వహిస్తున్నారు.

కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రతినిధులు, ఔత్సాహిక యువ వ్యాపారవేత్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విక్రేతల అభివృద్ధి అవకాశాలు, ప్రభుత్వ కొనుగోలు విధానాలు, వ్యాపార విస్తరణ, మార్కెట్ అనుసంధానాలు వంటి అంశాలపై నిపుణుల ద్వారా సమగ్ర అవగాహన కల్పించనున్నారు.

అలాగే ప్రభుత్వ రంగ సంస్థలు, పారిశ్రామికవేత్తల మధ్య వ్యాపార సంబంధాలను బలోపేతం చేసి, కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

సిద్ధిపేట జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈ యజమానులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, ఔత్సాహిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీఐసీసీఐ ప్రతినిధులు కోరారు.

## ఆర్డీవో ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై వివిధ పార్టీల నాయకలకు అవగాహన

**చేవెళ్ల ఆర్డిఓ పార్థ సింహారెడ్డి**

చేవెళ్ల ఆగస్టు 04 (మనం న్యూస్): చేవెళ్లలో ఖిఐఖ్లై రాజకీయ పార్టీల నాయకులతో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఖిఐఖ) కార్యక్రమం పై చేవెళ్ల నియోజకవర్గం లోని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో ఆర్డీఓ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా.... అధికారులు ఖిఐఖ ప్రక్రియ ఓటరు నమోదు, పేర్ల మార్పులు, తొలగింపులు,కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై రాజకీయ పార్టీల నాయకులకు వివరించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా,నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.రాజకీయ పార్టీల నాయకలు తమ తమ అభిప్రాయాలు,సూచనలు అధికారుల దృష్టికి తీసుకురాగా,వాటిని పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ఎన్నికల అధికారులు,తహసీల్దార్లు,బూత్ స్థాయి అధికారులు (ఆబౌలై) వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## శ్రీరంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ







మేడ్చల్, ఆగస్టు 4 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ శ్రీరంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆరోగ్య సేవల అమలు తీరును సమీక్షించారు.ఈ సందర్శన సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ మార్గదర్శకాల ప్రకారం ఔట్ పేషెంట్ సేవలు, గర్భిణీ స్త్రీలు శిశు ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమం, ఔషధ నిల్వలు, ల్యాబొరేటరీ సేవలు, రికార్డుల నిర్వహణ, హాజరు పట్టికలు, శుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, ఫార్మసీ, ఆరోగ్య కేంద్ర మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల నాణ్యతపై ఆరా తీసి, మరింత మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అనంతరం వైద్యాధికారి ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఎదురవుతున్న కొన్ని పరిపాలనా, మౌలిక సదుపాయాల సంబంధిత అంశాలను వైద్యాధికారి డా. కె. ఆనంద్ దృష్టికి తీసుకువెళ్లారు. వాటిని శ్రద్ధగా విన్న ఆయన, సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో ఇదే శ్రీరంగవరం పీహెచ్సీలో వైద్యాధికారిగా సేవలందించిన డా. కె. ఆనంద్, నేడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా తిరిగి తమ కేంద్రాన్ని సందర్శించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆయన సేవా దృక్పథం, సిబ్బందితో కలిసిమెలిసి పనిచేసే తీరును గుర్తుచేసుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు.డా. ఆనంద్ కూడా తనకు శ్రీరంగవరం పీహెచ్సీతో ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొంటూ, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.



## హరీశ్ రావుపై క్షుద్ర పూజల ఆరోపణలు

**ఓయూ పోలీస్ స్టేషన్లో టీపీసీసీ నేత ఫిర్యాదు.. సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చనగాని దయాకర్ డిమాండ్..**

సికింద్రాబాద్, ఆగస్టు 4 (మనం న్యూస్) మాజీ మంత్రి హరీశ్ రావుపై క్షుద్ర పూజలు నిర్వహించారంటూ ఆరోపణలు చేస్తూ టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, తెలంగాణలో వర్షాలు కురవకుండా, కరువు పరిస్థితులు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడేలా రాజకీయ ప్రయోజనాల కోసం హరీశ్ రావు కుట్రపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో 2026 మార్చి 2-3 తేదీల్లో తమిళనాడులోని తిరుచిరాపల్లి, మే 31 నుంచి జూన్ 1 వరకు కర్ణాటకలోని శివమొగ్గ, జూన్ 2న తిరుచిరాపల్లి, జూలై 23న శివమొగ్గ ప్రాంతాల్లో హరీశ్ రావు స్వయంగా వెళ్లి పూజారులతో క్షుద్ర పూజలు చేయించారని సమాచారం అందిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ లబ్ధి కోసం ఇటువంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడటం ప్రజల్లో గందరగోళం సృష్టించే అంశమని చనగాని దయాకర్ అన్నారు. రాష్ట్రానికి నష్టం కలిగించే ఉద్దేశంతో తాంత్రిక, క్షుద్ర పూజలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలకు పాల్పడ్డారనే ఆరోపణలపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) తో పాటు ఇతర సంబంధిత చట్టాల ప్రకారం హరీశ్ రావుపై కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆయన కోరారు.

## వైభవంగా బోనాల ఉత్సవాలు

**అంతారం గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు**

చేవెళ్ల,ఆగస్టు 04 (మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం అంతారం గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో,అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా..... సర్పంచ్ జుట్టు రామస్వామి మాట్లాడుతూ...... మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి, ఉత్సాహాలతో వేడుకలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో వెంకటేష్(రాజు), ప్రవీణ్ గౌడ్,సుధాకర్, జయమ్మ, పాండు యాదవ్, శేఖర్,ఛిజి.సుధాకర్, మహేందర్, తరుణ్,మాణిక్యం,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



# పోచారం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ చేరికలు

**కొర్రెముల బాలాజీ నగర్, నందన్ హిల్స్ కాలనీలో సుమారు 50 మంది కాంగ్రెస్లో చేరిక**

**ప్రజా సంక్షేమ పథకాలపై విశ్వాసంతో కాంగ్రెస్లోకి వస్తున్న ప్రజలు – పోచారం డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్**



ఘట్కేసర్ మనం న్యూస్ ఆగస్టు 04 : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం డివిజన్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరో ఊతమిచ్చేలా కొర్రెముల గ్రామంలోని బాలాజీ నగర్, నందన్ హిల్స్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ చేరికల కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది స్థానికులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు.

పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేష్ ఆధ్వర్యంలో, ఘట్కేసర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేశపావుల వినోద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని నందన్ హిల్స్ కాలనీ అధ్యక్షుడు శామల శ్రీధర్ రెడ్డి సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి నాయకులు ఘనంగా స్వాగతం పలుకగా, కార్యకర్తలు నినాదాలతో కార్యక్రమానికి ఉత్సాహాన్ని తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా కర్రె రాజేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం రోజురోజుకు పెరుగుతోందని, అందుకే అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుండటంతో కాంగ్రెస్పై నమ్మకం మరింత బలపడుతోందని పేర్కొన్నారు.

పోచారం డివిజన్లో ప్రతి కాలనీ, ప్రతి బస్తీలో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.

ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మరింత సేవాభావంతో పనిచేస్తామని, యువతకు, మహిళలకు, కార్మికులకు, పేద కుటుంబాలకు అండగా నిలుస్తామని ఆయన హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో పోచారం డివిజన్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రతి కాలనీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పోరాటాలు చేపడతామని వెల్లడించారు.

ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని, ప్రజలకు చేరువగా పనిచేస్తున్న కాంగ్రెస్ నాయకత్వంపై విశ్వాసంతోనే పార్టీలో చేరామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కొర్రెముల గ్రామ మాజీ ఉపసర్పంచ్ పల్లె బాబురావు, మాజీ గ్రామ అధ్యక్షుడు బైండ్ల జంగయ్య, మాజీ వార్డు సభ్యుడు మాటలు రవి, దయ్యాల ఆంజనేయులు, సంతోష్, మహేష్, యువజన కాంగ్రెస్ నాయకుడు వంశీ యాదవ్తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ముగింపులో నాయకులు మాట్లాడుతూ, పోచారం డివిజన్లో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు మరింత బలోపేతమవుతోందని, ప్రజల విశ్వాసం, ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు జరిగే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు...

---

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

**గతంలో కే సీ ఆర్ చేసిన వాక్యాలు కే టీ ఆర్ కు గుర్తులేవా?**

**ఇంజనీరింగ్ విద్యార్థులను అవహేళన చేసింది బీ ఆర్ ఎస్ ప్రభుత్వమే**

**యువతను మోసం చేసింది గత ప్రభుత్వమే**

**రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీలోముందంజ**

**అభివృధి ఉపదే ప్రభుత్వ లక్ష్యం**

**యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలి,**

**ప్రభుత్వం ఇప్పటికే తీర్పు ఇచ్చారు.**

**కాంగ్రెస్ సీనియర్ నేత రామన్న గారి రాఘవేందర్ గౌడ్**



మేడ్చల్, ఆగస్టు 4 ( మనం జిల్లా ప్రతినిధి): రాజకీయ లబ్ధి కోసం సీఎం వ్యాఖ్యలను వక్రీకరించడం తగదు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్న గారి రాఘవేందర్ గౌడ్  తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

**గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు కేటీఆర్కు గుర్తులేవా?**

కేటీఆర్ విమర్శలు చేసే ముందు గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసుకోవాలని రాఘవేందర్ గౌడ్ సూచించారు. ఇంజనీరింగ్ కళాశాలల సంఖ్యపై ప్రశ్నించిన విషయాన్ని, 'ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు' అంటూ విద్యార్థులను అవమానించేలా వ్యాఖ్యానించిన సంఘటనలను కేటీఆర్ మర్చిపోవద్దని అన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులను అవహేళన చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే నని విమర్శించారు.

ఇంజనీరింగ్ విద్యా వ్యవస్థ, విద్యార్థులపై గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన వ్యాఖ్యలు యువతలో తీవ్ర నిరాశను కలిగించాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు అదే పార్టీ యువత పట్ల ప్రేమ చూపిస్తున్నట్లు మాట్లాడటం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు.

**యువతను మోసం చేసింది గత ప్రభుత్వమే**

బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని, ఉద్యోగాల భర్తీలో తీవ్ర జాప్యం జరిగిందని ఆరోపించారు. వేలాది మంది యువత భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడిందని, ఇప్పుడు అదే నాయకులు యువత పేరుతో రాజకీయాలు చేయడం సమంజసం కాదన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో ముందంజ

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాల ద్వారా ప్రైవేట్ రంగంలోనూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదేనని రాఘవేందర్ గౌడ్ తెలిపారు.

అభివృద్ధి, ఉపాధే ప్రభుత్వ లక్ష్యం  ప్రస్తుత ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన వంటి అంశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఎన్నికల హామీల అమలుతో పాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

**యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలి**

సంగ్రామ సభలు, ప్రెస్ మీట్లు పేరుతో ప్రజలను, ముఖ్యంగా యువతను తప్పుదోవ పట్టించే రాజకీయ ప్రచారాలను కేటీఆర్ విరమించుకోవాలని రాఘవేందర్ గౌడ్ సూచించారు. ప్రజలకు వాస్తవాలను చెప్పకుండా రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న విమర్శలు చివరికి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితికి దారితీస్తాయని అన్నారు.

**ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారు**

ప్రజలు గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారని, అయినా కూడా తమ వైఖరిలో మార్పు రాకపోతే భవిష్యత్తులో మరింత గట్టి సమాధానం చెబుతారని హెచ్చరించారు.

**కాంగ్రెస్ నాయకుడి హెచ్చరిక**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని కేటీఆర్కు రామన్న గారి రాఘవేందర్ గౌడ్ సూచించారు. ప్రజల అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను రాజకీయ కక్షతో విమర్శించడం సరికాదని ఆయన స్పష్టం చేశారు.

# పెరుమాల చెరువు అభివృద్ధికి కీలక ముందడుగు

**యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యుగేంధర్ రెడ్డి నిరంతర కృషితో చెరువు అభివృద్ధి పనులకు వేగం**

**ఇన్ఫోసిస్ సి ఎస్ ఆర్ నిధులతో త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం.. ఘట్కేసర్ సర్కిల్కు మినీ ట్యాంక్బండ్గా తీర్చిదిద్దనున్న పెరుమాల చెరువు**




ఘట్కేసర్ మనం న్యూస్ ఆగస్టు 04: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని పెరుమాల చెరువు అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. పోచారం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యుగేంధర్ రెడ్డి చేపట్టిన నిరంతర కృషి ఫలితంగా చెరువు హద్దుల నిర్ధారణ (బౌండరీ ఫిక్సింగ్) ప్రక్రియ పూర్తికావడంతో పాటు అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి.

ప్రతిష్ఠాత్మక ఇన్ఫోసిస్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో పెరుమాల చెరువు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే చెరువు పరిసర ప్రాంతం సుందరీకరణతో పాటు ప్రజలకు విశ్రాంతి, వినోదానికి అనువైన ప్రదేశంగా మారనుంది.

పెరుమాల చెరువు సమీపంలో ఉన్న ప్రముఖ దేవాలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు విచ్చేస్తుండటంతో, చెరువు అభివృద్ధి అనంతరం ఈ ప్రాంతం ఘట్కేసర్ సర్కిల్కు మినీ ట్యాంక్బండ్ తరహాలో రూపుదిద్దుకుని భక్తులు, స్థానిక ప్రజలు, యువత, కుటుంబాల కోసం ఆహ్లాదకరమైన ప్రజా విహార కేంద్రంగా మారుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి ఇరిగేషన్ డీఈఈ అంజనేయులు హెచ్ఎండీఏ అధికారులకు అధికారిక లేఖలు పంపించి అవసరమైన అనుమతులు, సాంకేతిక సమన్వయం కోసం చర్యలు చేపట్టారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా కృషి కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యుగేంధర్ రెడ్డి మాట్లాడుతూ, పెరుమాల చెరువు అభివృద్ధి కేవలం ఒక సుందరీకరణ ప్రాజెక్టు మాత్రమే కాదని, పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణ, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ప్రజలకు ఆహ్లాదకరమైన విహార వాతావరణం అందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సహకారంతో ఈ ప్రాజెక్టును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి కొనసాగిస్తామని అన్నారు.

ఈ అభివృద్ధి కార్యక్రమానికి సహకరించిన డీసీసీ అధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, ఇరిగేషన్ డీఈఈ అంజనేయులు, ఇరిగేషన్ ఏఈఈ మౌనిక, ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి, డీఈఈ నరేష్లకు యుగేంధర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పెరుమాల చెరువు అభివృద్ధి పూర్తయిన అనంతరం ఈ ప్రాంతం పర్యావరణ హితమైన ప్రజా విహార కేంద్రంగా, ఆధ్యాత్మిక పర్యాటకానికి అనుకూలమైన ప్రదేశంగా, ఘట్కేసర్ సర్కిల్లో ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని స్థానికులు, ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆకిడి బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నమ్మకమే నేరానికి ఆయుధం

**- పరిచయమైన మహిళ నగలు కాజేసిన కేటుగాడు.**
**- తప్పు నంబర్తో ఏర్పడిన పరిచయం.**
**- మహిళను హైదరాబాద్కు రప్పించి బంగారు నగలు చోరీ?**
**- బాధితురాలి ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు.**

కుషాయిగూడ, ఆగస్టు 4 (మనం న్యూస్): తప్పు నంబర్కు ఫోన్ చేయడంతో ఏర్పడిన పరిచయాన్ని ఆసరాగా చేసుకున్న ఓ వ్యక్తి, మహిళను నమ్మించి ఆమె బంగారు 3.2 తులాల నగలను కాజేసిన ఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది.

పోలీసుల వివరాల ప్రకారం, మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన మంచాల లలిత (50)కు సుమారు పది రోజుల క్రితం ఫోన్ ద్వారా సాయిరాం అని పరిచయం చేసుకున్న వ్యక్తి, తాను హైదరాబాద్లో ట్రావెల్స్ వ్యాపారం చేస్తున్నట్లు నమ్మించాడు. చీరల వ్యాపారం నిమిత్తం నగరానికి వచ్చిన బాధితురాలిని జేబీఎస్ వద్ద కలుసుకుని కోటిలో, అనంతరం కుషాయిగూడలోని షాపింగ్ మాల్కు తీసుకెళ్లి కొనుగోళ్లు చేయించాడు.

తర్వాత హోటల్కు తీసుకెళ్లిన సమయంలో మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడు, 3.2 తులాల గొలుసు ధరించడం సురక్షితం కాదంటూ మాయమాటలు చెప్పి వాటిని హ్యాండ్బ్యాగ్లో పెట్టించాడు. అనంతరం ఆమెను జేబీఎస్ వద్ద దింపి వెళ్లిపోయాడు. తర్వాత బ్యాగ్ పరిశీలించగా బంగారు నగలు కనిపించకపోవడంతో బాధితురాలు అతడికి ఫోన్ చేయగా నంబర్ బ్లాక్ చేసినట్లు తెలిసింది. హోటల్లో తాను వాష్రూమ్కు వెళ్లిన సమయంలోనే నగలను అపహరించి ఉండవచ్చని బాధితురాలు అనుమానం వ్యక్తం చేసింది.

బాధితురాలి ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి ఆచూకీ కోసం సీసీటీవీ దృశ్యాలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# గద్దరన్న ఆలోచనలు నేటి సమాజానికి మరింత అవసరం

**ఆగస్టు 6న రవీంద్రభారతిలో గద్దరన్న 3వ వర్ధంతి సభకు భారీగా హాజరుకావాలని పిలుపు..**

సికింద్రాబాద్, ఆగస్టు 4 (మనం న్యూస్) ప్రజాకవి గద్దరన్న 3వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆరట్స్ కాలేజీ ఎదుట మంగళవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సభ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆగస్టు 6న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్న వర్ధంతి సభకు విద్యార్థులు, యువజనులు, ప్రజాస్వామ్యవాదులు, కళాకారులు, రచయితలు, మేధావులు, పాత్రికేయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా గద్దర్ ఫౌండేషన్ సెక్రటరీ సూర్యం, విద్యార్థి నాయకులు కోట శ్రీనివాస్ గౌడ్ తదితరులు మాట్లాడుతూ గద్దరన్న జీవితం, పాటలు, భావజాలం నేటి సమాజానికి అత్యంత ప్రాసంగికమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన గానంతో దేశవ్యాప్తంగా వినిపించిన గొప్ప ప్రజాకళాకారుడిగా గద్దర్ గుర్తింపు పొందారని, అణగారిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. ప్రశ్నించే గొంతులను అణిచివేసే ధోరణులు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో గద్దరన్న ఆలోచనలు, ప్రజల పక్షాన నిలిచిన ఆయన తత్వం మరింత అవసరమని అభిప్రాయపడ్డారు. యువత గద్దరన్న సందేశాన్ని అధ్యయనం చేసి ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎల్. మూర్తి, ఆజాద్, సునీల్ శెట్టి, ఉదయ్, శ్రీకాంత్, ఎస్. నాగేశ్వర్ రావు, బద్రి, వలిగొండ నర్సింహా, రవీందర్ నాయక్, నామ సైదులు, అనిత, నెహ్రూ నాయక్, కాశీనాథ్, అవ్వరు వేణు, బాను, ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ సభ్యుడు పరశురామ్, మోడెం రవి తదితరులు పాల్గొన్నారు.



# నన్ను కాదు... నా సంకల్పాన్ని ఎదుర్కోవాలి

**రాజకీయాలు నాకు పదవి కాదు... ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత**

**తార్నాకలో రాజకీయ పరిణామాలు, తనపై జరుగుతున్న ప్రచారం, భవిష్యత్ కార్యాచరణపై యువనేత శ్రీరామ్ వెంకటేష్తో మనం విలేకరి ప్రత్యేక ముఖాముఖి..**



సికింద్రాబాద్, ఆగస్టు 4 (మనం న్యూస్) ఈ మధ్య కాలంలో హైదరాబాద్ నగరంలో బీజేపీ పార్టీ లో తార్నాక డివిజన్ హాట్ టాపిక్ గా మారింది..

4 నెలల కిందట సామాజిక సేవకుడు యువనేత శ్రీ రామ్ వెంకటేష్ కాషాయ కండువా కప్పుకొని రాజకీయాల్లో వచ్చారు. ఆయన రాకతో తార్నాక డివిజన్ తో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీజేపీ పార్టీ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. చురుకుగా ప్రజల్లో ఉంటూ సేవ కార్యక్రమాలు చేస్తూ బీజేపీ పార్టీ ని బలంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో శ్రీ రామ్ వెంకటేష్ ఎదుగుదలను చూసి కొందరూ ఓర్వలేక సొంత పార్టీ నాయకులు ఆయన ఆయన చేసిన ఆరోగ్య శిబిరానికి సంబంధించిన ఫ్లెక్సీలను తొలగింపచేసి సికింద్రాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చకు దారి తీశారు. అనంతరం మరల ఆయన ఎస్ఐఆర్ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు దుండగులు రాత్రికి రాత్రే చించేశారు.. అంతకుముందు ఆయన కారుపై కూడా దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం చేశారు.. వీటన్నిటి వెనుక కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే టికెట్ రాక బీజేపీ పార్టీలో చేరిన సొంత పార్టీకి చెందిన నాయకుల హస్తం ఉన్నట్టు నగర వ్యాప్తంగా గుసగుసలు వినిపించాయి.. ఈ క్రమంలో తార్నాక డివిజన్ లో బీజేపీ పార్టీలో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో శ్రీరామ్ వెంకటేష్ ను 'మనం' దినపత్రిక విలేకరి పలకరించారు.

**ప్రశ్న: ఇటీవల తార్నాక డివిజన్ రాజకీయాలు నగరవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ పరిణామాలను మీరు ఎలా చూస్తున్నారు?**

శ్రీరామ్ వెంకటేష్: గత నాలుగు నెలల క్రితం నేను బీజేపీ కండువా కప్పుకొని రాజకీయాల్లోకి వచ్చాను. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను. నా రాకతో తార్నాక డివిజన్తో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారాయని ప్రజలే చెబుతున్నారు. ప్రజల్లో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల ఆదరణ పెరుగుతోంది. అదే కొందరికి అసౌకర్యంగా మారినట్టు కనిపిస్తోంది.

**ప్రశ్న: మీ ఎదుగుదలను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం ఉంది. దీనిపై మీ అభిప్రాయం?**

శ్రీరామ్: ప్రజల మధ్య పనిచేసే ప్రతి నాయకుడికి సవాళ్లు సహజం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం... సవాళ్లు నన్ను ఆపలేదు, మరింత బలంగా మార్చాయి. నా దారి ప్రజాసేవ. అదే కొనసాగుతుంది. నన్ను ఆపాలని ప్రయత్నించే ప్రతి సంఘటన ప్రజలకు మరింత దగ్గర కావాలనే నా సంకల్పాన్ని మరింత బలపరుస్తోంది.

**ప్రశ్న: మీ ఫ్లెక్సీలను చించివేయడం, మీ కారుపై దాడి జరగడం వంటి ఘటనలు పెద్ద చర్చకు దారితీశాయి. వీటిని ఎలా చూస్తున్నారు?₹**

శ్రీరామ్: ఈ ఘటనలు బాధాకరమే. అయినా నేను వ్యక్తులపై పోరాటం చేయను. సమస్యలపై పోరాటమే నా రాజకీయాల సారాంశం. నేను చట్టాన్ని గౌరవిస్తాను. ప్రజలను నమ్ముతాను. ప్రతి అడ్డంకి నాకు మరింత బాధ్యతను గుర్తు చేస్తుంది.

**ప్రశ్న: ఈ ఘటనల వెనుక సొంత పార్టీకి చెందిన కొందరు నాయకుల హస్తం ఉందనే ప్రచారం కూడా జరుగుతోంది. మీరు ఏమంటారు?**

శ్రీరామ్: నేను ఎప్పుడూ వ్యక్తులపై ఆరోపణలు చేయను. ఎవరు ఏమి చేశారనేది సంబంధిత వ్యవస్థలు చూసుకుంటాయి. నా దృష్టి మాత్రం ప్రజల సమస్యల పరిష్కారంపైనే ఉంటుంది. వ్యక్తిగత వివాదాల కంటే అభివృద్ధి రాజకీయాలను నేను విశ్వసిస్తాను.

**ప్రశ్న: కొందరు మీరు రాజకీయాల నుంచి తప్పుకుంటారని ప్రచారం చేశారు. దీనికి మీ సమాధానం?**

శ్రీరామ్: ప్రజల నమ్మకంతో ప్రారంభమైన ప్రయాణం పుకార్లతో ఆగదు. రాజకీయాలు నాకు హోదా కోసం కాదు... సేవ కోసం. వెనక్కి తగ్గే ఆలోచనే లేదు. ప్రజల ఆశీస్సులతో మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతాను.

**ప్రశ్న: వ్యక్తిగత విమర్శలు, అవమానాలు ఎదురైనప్పుడు ఎలా స్పందిస్తారు?**

శ్రీరామ్: నాయకుడి సహనం అతని బలం. ప్రతి విమర్శకు నా సమాధానం పని. ప్రతి ఆరోపణకు నా సమాధానం ప్రజల విశ్వాసం. మాటలతో కాదు... పనితో సమాధానం చెప్పాలనేది నా నమ్మకం.

**ప్రశ్న: ప్రస్తుతం తార్నాకలో మీరు చేపడుతున్న కార్యక్రమాల గురించి చెప్పండి..**

శ్రీరామ్: తార్నాక ప్రాంతంలో సేవా కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నాను. ప్రతి కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతతో నిర్వహిస్తున్నాను. ప్రజలతో ఉన్న అనుబంధమే నాకు అతిపెద్ద బలం.

**ప్రశ్న: ప్రత్యర్థుల రాజకీయాలను ఎలా చూస్తారు?**

శ్రీరామ్: ప్రజాస్వామ్యంలో పోటీ అవసరం. కానీ ఆ పోటీ ప్రజల సమస్యల పరిష్కారంలో ఉండాలి. వ్యక్తిగత విభేదాలు సమాజానికి ఉపయోగం చేయవు. ప్రజల కోసం ఎవరు ఎక్కువ పనిచేస్తారనే పోటీ ఉండాలి.

**ప్రశ్న: మీకు అతిపెద్ద బలం ఏమిటి?**

శ్రీరామ్: ప్రజల ప్రేమ. అది ఉంటే ఎలాంటి ప్రచారం, ఎలాంటి అడ్డంకి కూడా ఎక్కువకాలం నిలవదు. ప్రజల విశ్వాసమే నా బలం.

**ప్రశ్న: యువ నాయకులకు మీరు చెప్పే సందేశం?**

శ్రీరామ్: రాజకీయాల్లో కోపం కాదు... క్రమశిక్షణ ముఖ్యం. మాటల కంటే పని ఎక్కువ మాట్లాడాలి. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలంటే సేవాభావం అవసరం.

**ప్రశ్న: మీ భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉండబోతోంది?**

శ్రీరామ్: ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందించాలనేది నా లక్ష్యం. సేవా కార్యక్రమాలు, యువతకు అవకాశాలు, ప్రజా సమస్యల పరిష్కారం... ఇవే నా ప్రాధాన్యతలు.

**ప్రశ్న: మిమ్మల్ని అడ్డుకోవాలనే ప్రయత్నాలు కొనసాగితే?**

శ్రీరామ్: నన్ను ఆపాలని ప్రయత్నించే ప్రతి సంఘటన నా సంకల్పాన్ని మరింత బలపరుస్తుంది. నేను చట్టాన్ని గౌరవిస్తాను. ప్రజలను నమ్ముతాను. భయపడే ప్రసక్తే లేదు.

**ప్రశ్న: రాజకీయాల్లో మీ సిద్ధాంతం ఏమిటి?**

శ్రీరామ్: వ్యక్తుల కంటే విలువలు గొప్పవి. పదవుల కంటే ప్రజల విశ్వాసం గొప్పది. అదే నా రాజకీయాల పునాది. రాజకీయాలు నాకు పదవి కాదు... ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత.

**ప్రశ్న: మీ విజయ రహస్యం ఏమిటి?**

శ్రీరామ్: ప్రజల గడప దాటి వారి సమస్యలు వినడం. ఎన్నికల సమయంలో మాత్రమే కాదు... ప్రతి రోజూ ప్రజల మధ్య ఉండడం. అదే నా విజయానికి కారణం.

**ప్రశ్న: తార్నాక ప్రజలకు మీ హామీ ఏమిటి?**

శ్రీరామ్: మీ ఇంటి సమస్య నా సమస్య. మీ నమ్మకాన్ని నిలబెట్టే నాయకత్వాన్ని అందించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను. ప్రజాసేవలో రాజీ ఉండదు.

**ప్రశ్న: చివరిగా మీ ప్రత్యర్థులకు ఏమి చెప్పాలనుకుంటున్నారు?**

శ్రీరామ్: ప్రజల కోసం ఎక్కువ పని చేసే పోటీ ఉంటే అందరికీ మేలు. చివరకు తీర్పు ప్రజలదే. ఆ తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలి. నా రాజకీయాలు వ్యక్తులపై కాదు... ప్రజల సమస్యల పరిష్కారంపైనే కొనసాగుతాయి. 'నన్ను కాదు... నా సంకల్పాన్ని ఎదుర్కోవాలి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు విజన్... కేంద్ర కిషన్ రెడ్డి జాతీయ దృక్పథం.. ఎంపీ డా. కె. లక్ష్మణ్ సంస్థాగత మార్గనిర్దేశం... మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ క్షేత్రస్థాయి నాయకత్వం - తార్నాకలో బీజేపీ విస్తరణకు ఇవే మా బలం.'

శ్రవణ్
సికింద్రాబాద్